క్లుప్తంగా

యూత్, రైతు విభాగాల అధ్యక్షులు వీరే..


నెల్లి దుర్గాప్రసాద్


తులా గోపాలకృష్ణ

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగాయి. యూత్ విభాగం అధ్యక్షునిగా పాశర్లపూడి–1 ఎంపీటీసీ, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, రైతు విభాగం అధ్యక్షునిగా అప్పనపల్లి గ్రామానికి చెందిన తులా గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఇంకా పలు విభాగాలకు అధ్యక్షులను నియమించారు. పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సిఫారసు మేరకు ఈ నియామకాలు జరిగాయి.

నేడు మండల పరిషత్ సమావేశం

అయినవిల్లి: వివిధ అంశాలపై చర్చించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జీవీ సరోవరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో హాజరుకావాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అంబాజీపేట: గంగలకుర్రు, అంబాజీపేట సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అంబాజీపేట, మాచవరం, వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు గున్నేపల్లి, గంగలకుర్రు పరిధిలో కె.పెదపూడి, మొసలపల్లి, పాలగుమ్మి, నడిపూడి, బండారులంక గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 33 కేవీ, 11 కేవీ లైన్లను మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

డీపీఓ శాంతాలక్ష్మి


ఈదరాడలో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న డీపీఓ

మామిడికుదురు: సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని డీపీఓ డి.శాంతాలక్ష్మి ఆదేశించారు. ఆమె గురువారం ఈదరాడ, పాశర్లపూడి గ్రామాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాలు బాగుంటేనే ఇది సాధ్యమవుతుందని చెప్పారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సంపూర్ణ పారిశుధ్యం సాధ్యమవుతుందన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, దానిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించడం ద్వారా పంచాయతీలు కూడా ఆర్థికంగా పరిపుష్టి అవుతాయన్నారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీఓ అడబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి పీవీ ఆర్‌కే రాజు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

సఖినేటిపల్లి: మోరి మెయిన్ ప్రాథమిక పాఠశాల వద్ద గురువారం విద్యా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ ర్యాలీ నిర్వహించారు. డీఈఓ డాక్టర్ షేక్ సలీం బాషా ఆదేశాల మేరకు జిల్లా కమ్యూనిటీ మొబిలిటీ ఆఫీసర్ బి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని, వివిధ కారణాల రీత్యా బడి మానేసిన పిల్లలను కూడా స్కూళ్లలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఎంఈఓ–2 మద్దాలి వెంకటేశ్వరరావు, మోరి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్‌కృష్ణ, నాగార్జున, టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా నిర్మూలన

అలమూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ పరిధిలో గురువారం వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడేపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మలేరియా నివారణకు దోమల నిర్మూలనే సరైన మార్గమని చెప్పారు.

అనుకూలించేనా..!

- రైతులను వెంటాడుతున్న కూలీల కొరత
- నానాటికీ పెరుగుతున్న రేట్లు
- కష్టతరమైన లభ్యత
- భారంగా మారుతున్న సాగు పెట్టుబడి
- పూర్తిగా అందుబాటులోకి రాని యాంత్రీకరణ
- బెంగాలీ, కృష్ణా కూలీలే ఆధారం


గత దాళ్వాలో రామరాజులంకలో వరి కోస్తున్న కూలీలు

మలికిపురం: పంట కాలువలకు నీరు విడుదలై సార్వా సాగుకు సన్నద్ధమవుతున్న ప్రస్తుత తరుణంలో రాజోలు దీవిలో రైతాంగానికి వ్యవసాయ కూలీల కొరత కూడా అధికమైంది. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో వరి నాట్లు ఏకకాలంలో ప్రారంభమవుతాయి. ఈ ప్రాంతంలో సుమారు 17 వేల ఎకరాలుండగా, పలు గ్రామాలలో డ్రెయిన్ల ముంపు కారణంగా 40 శాతం నాట్లు పడే అవకాశం లేదు. ఈ ఏడాది సఖినేటిపల్లి మండలంలో ముంపు నీటిని ఇంజిన్ల ద్వారా మళ్లించి, ఆయకట్టును పెంచుతామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రకటించారు. ఈ ప్రణాళిక కూడా మొదలైంది. ఇలాఉంటే, సాగుకు రైతాంగం సిద్ధమవుతుండగా, కూలీల సమస్య అధికమైంది. పదేళ్ల క్రితం మహిళలకు రూ.150, మగవారికి రూ.200 ఉండే రోజు వారీ కూలి ప్రస్తుతం మహిళలకు రూ.500, మగవారికి రూ.600కు పెరిగింది. అయినా కూలీలు దొరకడం కష్టతరంగా మారింది. ఫలితంగా పనులు వాయిదా వేయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.

ప్రకృతి వైపరీత్యాల్లో..

వ్యవసాయంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటున్న రైతులకు ఇటీవల తుపాన్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాల సమయంలో మరింత ఇబ్బంది అవుతుంది. వాటి తాకిడికి వరి చేలు నేలనంటుతున్నాయి. దీంతో వాటిని ఒబ్బిడి చేయడం రైతులకు చాలా ఇబ్బందిగా మారుతోంది. కూలీల సంఖ్య పెంచాల్సి వస్తోంది. నేల కొరిగిన వరిచేలను మసూళ్లు చేయాలంటే రైతులకు మరింత ఖర్చు అవుతోంది. తుపాన్ల కారణంగా దిగుబడిపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది. దీనికితోడు కూలీల కొరత వల్ల కోతలు, నాట్లు ఆలస్యం కావడంతో నష్టాలు కూడా పెరిగే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.

క్రమంగా కనుమరుగు

కూలీల కొరతకు ప్రధాన కారణం గతంలో పొలం పనులు చేసేందుకు గ్రామస్తులు అధికంగా ఉండేవారు. రానురాను గ్రామాల్లో విద్యాభ్యాసం పెరగడంతో రెండు దశాబ్దాలుగా కూలీల సంఖ్య క్రమేపీ తగ్గుతూ వస్తోంది. గతంలో వ్యవసాయ పనులు చేసేందుకు బంటా మేస్త్రులు ఉండి, కూలీల జట్లు నడిపేవారు. ప్రస్తుతం మేస్త్రులే కనుమరుగయ్యారు. ఒక్కొక్క గ్రామంలో గతంలో 200కు పైగా ఉండే కూలీల సంఖ్య ప్రస్తుతం 20కి తగ్గింది. ఈ పరిస్థితి ముందుముందు మరింత తీవ్రమవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రైతులపై భారం

ఇలాఉంటే అధిక ధరలు చెల్లించి వ్యవసాయ పనులు చేయించడం వల్ల రైతులపై అధిక భారం పడుతుంది. దిగుబడులు కూడా అంతంతమాత్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో కూలీల ధరలు, పెట్టుబడులు పెరగడం రైతులను ఆందోళన కలిగిస్తోంది. ఇక కౌలు రైతులు ప్రైవేట్ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టేందుకే కష్టం సరిపోతుందని అంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో పెట్టుబడి రైతులకు ఆసరాగా ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం దీనిని ఎగ్గొట్టడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని అంటున్నారు.

అంత ప్రయోజనంగా లేదు

గ్రామాల్లో వ్యవసాయ యాంత్రీకరణ వల్ల రైతులకు అంతగా ప్రయోజనం ఉండడం లేదంటున్నారు. చిన్న కమతాలు ఉండడంతో పాటు, యంత్రాలు తక్కువగా ఉండడం, నాట్ల సమయానికి అందుబాటులో ఉండక పోవడం వంటి కారణాల వల్ల రైతులు యాంత్రీకరణను వినియోగించుకోలేకపోతున్నారు. గ్రామాల్లో కూలీల కొరత కారణంగా ఒడిశా, బెంగాల్, కృష్ణా కూలీలే ఆధారమవుతున్నారు. వీరి ద్వారా నాట్లు త్వరగా అవుతున్నప్పటికీ, పెరిగిన పెట్టుబడి, తక్కువ దిగుబడి వల్ల రాబడి అంతగా గిట్టుబాటు కావడం లేదని రైతులు మథనపడుతున్నారు.

అందుబాటులో ఉంచాలి



ప్రస్తుత సార్వా సీజన్‌లో నాట్లకు సిద్ధమవుతున్న రైతాంగానికి యాంత్రీకరణ అందుబాటులో ఉంచాలి. చిన్న, సన్నకారు రైతులకు వరి నాట్ల యంత్రాలతో పాటు, ధరలూ అందుబాటులో ఉంచాలి. నాట్లు పూర్తయ్యే దాకా యంత్రాలు అందుబాటులో ఉంచాలి. కూలీల కొరత కారణంగా రైతులు అవస్థలు పడుతున్నారు.

– గుబ్బల రమేష్, మాజీ సభ్యుడు, జిల్లా వ్యవసాయ మండలి

అన్ని చర్యలూ తీసుకుంటాం



రానున్న సార్వా సాగు కోసం రైతులకు అనువైన అన్ని చర్యలు తీసుకుంటాం. కూలీల కొరత వేధిస్తుంది. వరి నాట్ల యంత్రాలు అందుబాటులో ఉంచుతాం. నారుమడులకు విత్తనాలు సిద్ధం చేస్తున్నాం. సూచించిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.

– సీహెచ్ రమ్యప్రియాంక, వ్యవసాయాధికారి

అధినేతను కలిసిన గొల్లపల్లి


వైఎస్ జగన్‌తో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో జరిగిన పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశానికి హాజరైన గొల్లపల్లి ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రాజోలు నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన రైతుకు గిట్టుబాటు ధర, వెన్నుపోటు దినం, యువత పోరు తదితర కార్యక్రమాలపై, నియోజకవర్గంలో పరిస్థితులపై సూర్యారావు అధినేతకు వివరించారు.

అలాగే విశ్వేశ్వరాయపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, రాజోలు నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ జిల్లెళ్ల ఉదయ్ కిరణ్ గురువారం మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. పార్టీ కోసం కష్టపడాలని అధినేత సూచించినట్టు ఉదయ్ తెలిపారు.


మాజీ సీఎం జగన్‌తో ఉదయ్‌కిరణ్

గంగయ్య సేవలు మరువలేనివి


గంగయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మంగెన గంగయ్య ప్రజలకు అందించిన సేవలు మరువ లేనివని ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ అన్నారు. గంగయ్య వర్ధంతి సందర్భంగా గురువారం మలికిపురం సెంటరులోని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. నిస్వార్థ సేవలతో నేటి రాజకీయ నాయకులు, యువతకు గంగయ్య ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గన్నవరం అక్విడెక్ట్, చించినాడ వంతెన నిర్మాణాల్లో పాలు పంచుకున్నారని, ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థల అభివృద్ధితో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, మాజీ జెడ్పీటీసీ మంగెన భూదేవి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పిలుపును ప్రజల్లో వినిపిద్దాం

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ.. అనే కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టోను గుర్తుచేస్తూ ఐదు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపును దిగ్విజయం చేయాలన్నారు. నాడు కులమతాలకు అతీతంగా పనిచేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఇచ్చిన హామీల కోసం అడిగితే ఎదురుదాడి చేసేది కూటమి ప్రభుత్వమని విమర్శించారు. కూటమి పార్టీలను గెలిపించినందుకు ప్రజలు ఇప్పుడు బాధ పడుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన అన్ని సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం కోత పెట్టిందని దుయ్యబట్టారు. కరోనా వంటి భయంకర పరిస్థితుల్లో సైతం సంక్షేమ పథకాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమలు చేస్తే, ఏ విపత్తులూ లేకపోయినా, ఏ పథకాలూ అమలు లేదని తీవ్రంగా విమర్శించారు.

దీనిపై అడిగితే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. ఆయా వాస్తవ పరిస్థితులను కార్యకర్తలు గ్రామాల్లోకి తీసుకువెళ్లాలని నిర్దేశించారు. ప్రస్తుతం ప్రజలు వైఎస్సార్ సీపీనే నమ్ముతున్నారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు నమ్ముతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి కాదని, దోపిడీ కోసం, ప్రజలను వేధించడానికి వచ్చిందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాసరావు, జాన శంకరరావు, కె.ఎస్తేరురాణి, రుద్రరాజు చిన్నరాజా, దొంగ నాగసత్యనారాయణ, తాడి సహదేవ్, గుబ్బల వీవీ సత్యనారాయణ, నేతల నాని, కొల్లాబత్తుల సతీష్, సోమిశెట్టి మురళి, కొడవటి దొరబాబు, అడబాల జానకిరామ్, కారుపర్తి భాస్కరరావు, ఇనుమర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు సత్కారం


సత్కారాలు అందుకుంటున్న రెవెన్యూ అధికారులు

సఖినేటిపల్లి: సేవా పురస్కారాలు అందుకున్న రెవెన్యూ అధికారులకు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు ఘనంగా సత్కరించారు. ఇటీవల కలెక్టరేట్‌లో కలెక్టర్ నుంచి విశిష్ట సేవా అవార్డులు అందుకున్న తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్ఐ వి.రామరాజు, వీఆర్వో బి.సీతారామం, రాజోలు తహసీల్దారుగా వెళ్లిన స్థానిక డీటీ సీహెచ్ భాస్కర్, కొత్తగా వచ్చిన మరో ఉద్యోగిని సన్మానించారు.

ఎస్సై, కానిస్టేబుల్ మృతికి సంతాపం


కొత్తపేటలో ఎస్సై, కానిస్టేబుల్ చిత్రాలకు నివాళులర్పిస్తున్న ఎస్సై సురేంద్ర, సిబ్బంది


ఎస్సై, కానిస్టేబుల్ ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, పోలీసులు

కొత్తపేట: ఆలమూరు ఎస్సై ఎం.అశోక్, కానిస్టేబుల్ జీవన్ మృతికి కొత్తపేటలో పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఓ కేసులో నిందితుల కోసం హైదరాబాద్ వెళుతుండగా కోదాడ–సూర్యాపేట మధ్య రోడ్డు ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై అశోక్ గతేడాది ఫిబ్రవరి 11 నుంచి ఆగస్టు 6 వరకూ కొత్తపేట ఎస్సైగా పనిచేశారు. అనంతరం ఆలమూరు ఎస్సైగా బదిలీ అయ్యారు. సుమారు 7 నెలల కాలంలో అన్ని వర్గాల ఆదరాభిమానాలు, పోలీస్ ఉన్నతాధికారులు, స్థానికుల మన్ననలు పొందారు. ఎస్సై, కానిస్టేబుళ్ల మృతికి సంతాపసూచకంగా స్థానిక ఎస్సై జి.సురేంద్ర ఆధ్వర్యంలో స్టేషన్ సిబ్బంది పోలీస్ స్టేషన్ వద్ద, పాత బస్టాండ్ సెంటర్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. వారి చిత్రాలకు నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్సై, కానిస్టేబుల్‌కు నివాళులు

పి.గన్నవరం: విధి నిర్వహణలో ఆలమూరు ఎస్సై అశోక్, కానిస్టేబుల్ జీవన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పోలీస్ శాఖకు తీరనిలోటని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్‌లో సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ చిత్రపటాలకు ఎమ్మెల్యేతో పాటు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు నివాళులర్పించారు. ఎస్సైలు బి.శివకృష్ణ, హరికోటి శాస్త్రి, చైతన్యకుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తులు ప్రమీలరాణి, హిమబిందు

రాజోలు: నిత్యం పని ఒత్తిడిలో ఉండే న్యాయవాదుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని రాజోలు సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి అన్నారు. గురువారం రాజోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమెతో పాటు, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు సందర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రంశెట్టి అయ్యప్పనాయుడు వైద్య శిబిరాలను ప్రారంభించారు. అమలాపురం మెడ్ యునైటెడ్ ఆస్పత్రికి చెందిన వైద్యులతో పాటు, రాజోలు డెంటల్ ఆస్పత్రి డాక్టర్ దొడ్డా పి.సాయిప్రసాద్ న్యాయవాదులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ప్రమీలరాణి, హిమబిందు మాట్లాడుతూ, కనీసం నెలకు ఒకసారైనా ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల మేలు జరుగుతుందన్నారు. సీనియర్ న్యాయవాదులు పొన్నాడ సూర్యారావు, కోట సుధాకర్, దొంగ రామ్మోహనరావు, అప్పారి హరిబాబు, గుమ్మాపు పద్మ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నేతలు

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా లూటుకుర్రు గ్రామంలో బీజేపీ నేతలు గురువారం మొక్కలు నాటారు. పార్టీ మండల అధ్యక్షుడు బైరిశెట్టి దుర్గారామకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం

కొత్తపేట: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల భవిష్యత్తు నాశనమవుతుందని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ కేపీ రాజు అధ్యక్షతన అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం జరిగింది. ఎన్ఎస్ఎస్, జువాలజీ విభాగం సంయుక్తాధ్వర్యంలో విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, మాదకద్రవ్యాలతో జీవితం చిన్నాభిన్నం అవుతుందన్నారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట బార్ అసోసియేషన్ సభ్యులు డి.బాలప్రతాప్, అల్లు భాస్కర్‌రావు, ఎస్ కృష్ణ, ఎస్సై జి.సురేంద్ర, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ డీసీహెచ్ పాపారావు, అధ్యాపకులు జి.శ్రీనివాసులు, కె.సత్యనారాయణ, కె.అంకమరావు, బి.విజయకుమార్, పి.ప్రసన్నజ్యోతి, ఎం హేమలత, పి.సాయికృష్ణ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రాజోలు: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనేక నష్టాలు ఉంటాయని, వీటికి దూరంగా ఉండాలని సీఐ టీవీ నరేష్‌కుమార్ అన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరుతూ గురువారం రాజోలు సర్కిల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో నుంచి ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. యాంటీ డ్రగ్స్ డేను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని సీఐ నరేష్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొందరు యువకులు మాదకద్రవ్యాలకు బానిసలు అవుతున్నారన్నారు. డ్రగ్స్, గంజాయి వాడకం ఎక్కువైందన్నారు. వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. మాదకద్రవ్యాలను వినియోగించినా, విక్రయించినా నేరమన్నారు. మాదకద్రవ్యాల నిరోధానికి పాఠశాలలు, కాలేజీలు, గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, డ్రైవర్లు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ చెల్లుబోయిన భాస్కర్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎస్సై రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పి.గన్నవరంలో నిర్వహిస్తున్న ర్యాలీ



కొత్తపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు


రాజోలులో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు, అధికారులు

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా కమ్యూనిటీ మొబిలిటీ ఆఫీసర్ బి.సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. పదో తరగతి పిల్లలకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం తీవ్రమైందని, వీటితో పూర్తి అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం వీటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎంఈఓ–2 మద్దాలి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం ఎస్.శ్రీధర్‌కృష్ణ, నాగార్జున, టీచర్లు పాల్గొన్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

పి.గన్నవరం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని స్థానిక మూడు రోడ్ల సెంటర్‌లో సీఐ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎక్కడైనా గంజాయి వంటి మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నా, ఎవరైనా వినియోగిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మూడు రోడ్ల సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, ఎస్సైలు బి.శివకృష్ణ, హరికోటి శాస్త్రి, చైతన్యకుమార్, వివిధ విద్యా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సత్కారం


సత్కారం అందుకుంటున్న బదిలీ అయిన ఉపాధ్యాయులు

అయినవిల్లి: ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. హెచ్‌ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన వీడ్కోలు సభ జరిగింది. ఉపాధ్యాయులు ఆర్.భాస్కరరావు, జి.వెంకటేశ్వరరావు, జి.రత్నకుమారి, ఎస్ నాగేశ్వరరావు, వీవీఎస్‌వీడీ భవాని, కె.సిద్ధార్థప్రసాద్, జి.యేసుకుమారిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులతో అనుబంధం మరువలేనిదన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలను అందజేశారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి బదిలీపై వచ్చిన తొమ్మిది మంది ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు.